
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 10 ఫిబ్రవరి 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





రాష్ట్రంలో సంక్షేమ పాలన : కాకాణి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, మళ్లీ వైసిపిదే అధికారం అని, టిడిపిని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర వ్యవసా య శాఖ మంత్రి కాకాణి గోవ ర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మంత్రి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో గెలిచిన పార్టీయే, రాష్ట్రంలో అ ధికారం లోకి వస్తుందన్న సెంటి మెంట్ ను సర్వేపల్లి ప్రజలు తనను గెలిపించి తిరగ రాశార న్నారు. సర్వేపల్లి నియోజ కవర్గం ప్రజలు మూడో సారి సర్వేపల్లిలో వైసిపి అభ్యర్థిని గెలిపించి లి"హ్యాట్రిక్" విజయా న్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గడప గడప కార్యక్ర మానికి విచ్చేసిన మంత్రి గోవ ర్ధన్ రెడ్డికి ప్రజలు అఖండ స్వా గతం పలికారు. వైసీపీ నాయకులు చిల్లకూరు సుధీర్ రెడ్డి, కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, వైసిపి నాయకులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మంత్రి 'కాకాణి'

మోగిన ఎన్నికల నగారా..!

- ◆ఎంఎల్‌సి పోలింగ్‌కు షెడ్యూల్ విడుదల
- ◆16న నోటిఫికేషన్
- ◆మార్చి13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు

కేంద్ర ఎన్నికల సంఘం ఎంఎల్‌సి ఎన్నికల నగారా మోగించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులతో ఈనెల 16న నోటిషికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 21వ తేదికి ఎన్నికల ప్రక్రియ ముగుస్తోంది. నేటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. తూర్పు రాయలసీమ నియోజక వర్గానికి సంబంధించి టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎన్నికలు నిర్వహిం చనున్నారు. పిడిఎఫ్, వైసిపి అభ్యర్థులు పోటీపడుతున్నారు. పిడిఎఫ్ అభ్యర్థులు ఇక్కడ వరుసుగా విజయం సాధిస్తున్నారు. ఎలాగైనా ఈ స్థానాలు తగ్గించుకోవాలని వైసిపి నేతలు కుయుక్తులు పన్నుతున్నారు. టీచర్లు, గ్రాడ్యుయేట్లు, మేధావులు చైతన్యంతో అభ్యర్థులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో ఖాళీగా పదవీ కాలం పూర్తి చేసుకున్న ఆరు ఎంఎల్‌సి ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. తూర్పు రాయలసీమ నియోజకవర్గం కింద ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, జిల్లాల్లో గ్రాడ్యుయేట్, టీచర్స్ నియోజకవర్గంలో ఎన్నికలు జరగను న్నాయి. గత మూడు నెలల నుంచి జిల్లా వ్యాపితంగా ఓట్లు చేర్పు, మార్పులు ప్రక్రియ వేగంగా సాగుతోంది. ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిగా యండపల్లి శ్రీనివాసులురెడ్డి, టీచర్ ఎంఎల్‌సిగా విఠపు బాలసుబ్రమణ్యం కొనసాగు తున్నారు. ఈ నియోజకర్గంలో కాంగ్రెస్, టిడిపి, ఎన్ని కుయుక్తులు చేసినా మేధావులు, టీచర్లు, విద్యావంతులు పిడిఎఫ్ ఎంఎల్‌సిలకు పట్టంకడు తున్నారు. రాష్ట్రంలోని తూర్పు రాయలసీమ ప్రత్యేకత సంతరించుకుంది. మేధావులుగా విటపు బాలసుబ్రమణ్యం జిల్లాలో ఎంతో శాస్త్రీయతంగా ప్రజా, టీచర్, సామాజిక సమస్యలపై ముక్కుసూటిగా మాట్లాడి అనేక సమస్యల పరిష్కారం కోసం ఆయన పనిచేశారు. ఇప్పటికే మూడు సార్లు ఎంఎల్‌సిగా గెలుపొందారు. పిడిఎఫ్ అభ్యర్థిగా యుటిఎఫ్‌తోపాటు, అన్ని ప్రజా, రాజకీయపార్టీలు, ఉపాధ్యాయులు యూనియన్లు ఆయన వెంట నిలిచారు. ఈ ఏడాది నిర్వహించనున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ టీచర్ నియోజకవర్గ అభ్యర్థిగా యుటిఎఫ్ ఉద్యమ నేత పి.బాబు రెడ్డి, గ్రాడ్యుయేట్ నియోజవర్గ అభ్యర్థిగా యుటిఎఫ్ నేత మీగడ వెంకటేశ్వర్లురెడ్డి బరిలో ఉన్నారు. ఇప్పటికే విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజా సమస్యలు తెలిసిన నేతలుగా వీరికి అన్ని చోట్ల మంచి ఆధరణ కనిపిస్తోంది. వైసిపి గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా కోట ప్రాంతానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, టీచర్ అభ్యర్థిగా ప్రముఖ కృష్ణచైతన్య విద్యా సంస్థల అధినేత పి. చంద్రశేఖర్‌రెడ్డి రంగంలోని ఉన్నారు. అధికారపార్టీ స్థానిక సంస్థల ఎన్నికల వలే ఈ రెండింటిని దక్కించు కోడానికి కుయుక్తులు పన్నుతోంది. అర్హత లేని వారిని ఓట్లుగా చేర్పించడం, తాయిలాలు ప్రకటించడం వంటి చర్యలకు దిగుతున్నారు. ఎంతో చైతన్య వంతమైన తూర్పు రాయలసీమ నియోజకవర్గ ఓట్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

తూర్పు రాయలసీమ నియోజకవర్గ ఓట్ల వివరాలు..

వ.స	జిల్లా	టీచర్స్	గ్రాడ్యుయేట్
1.	ప్రకాశం	5712	82, 189
2,	నెల్లూరు	7993	1,09,016
3.	బాపట్ల	1728	26,372
4.	తిరుపతి	6187	87,544
5.	చిత్తూరు	3545	54237
6.	అన్నమయ్య	1723	23704
మొత్తం		26888	3,83,062

ఎన్నికల షెడ్యూల్ విడుదల..!

తూర్పు రాయలసీమ (నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు) నియోజకవర్గం ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈనెల 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న నామినేషన్లు పరిశీలన ఉంటుంది. 27న నామి నేషన్లు ఉప సంహరణ , మార్చి 13 పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. 16వ తేదీ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 21న ఎన్నికల ప్రక్రియ ముగుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ విడుదల చేసే వరకు ఓట్లు చేర్పులు జరగనుంది. నియోజకవర్గంలో 26,888 టీచర్, గ్రాడ్యుయేట్లు 3,83,062 మంది ఓటర్లు ఉన్నారు.

టీచర్లు, గ్రాడ్యుయేట్ ఓటర్ల వివరాలు

తూర్పు రాయలసీమ నియోజకవర్గ పరిధిలోని నియోజకవర్గ ఓట్లు సిద్ధమయ్యాయి. ఇప్పటి వరకు ఉన్న ఓట్లతోపాటు, షెడ్యూల్ విడుదల చేసే వరకు ఓట్లు చేర్పు అవకాశం ఉంది. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాలు తూర్పు రాయలసీమ కిందకు వస్తున్నాయి. దీని కింద ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలు వస్తున్నాయి మొత్తం టీచర్ ఓటర్లు 26,888 మంది, గ్రాడ్యుయేట్ 3,83,062 ఓట్లు నమోదు చేసుకున్నారు. ఇవి ఎన్నికల సమయానికి కొంత పెరిగే అవకాశం ఉంది.

'ఉపాధి' వ్యవసాయ రంగాలకు

బడ్జెట్ కేటాయింపులు పెంచాలి



ధర్నాలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర బడ్జెట్‌లో 'ఉపాధి' హామీ పథకానికి వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు పెంచాలని ఉపాధి హామీ ఫీల్డ్ వర్కర్స్ యూనియన్, జిల్లా వ్యవసాయకార్మిక సంఘం, రైతు, కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రైతు సంఘం నాయకులు పి.శ్రీరాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీకి, వ్యవసాయరంగానికి కేంద్రం బడ్జెట్‌లో కోత కోయడం గ్రామీణ భారతాన్ని ఆర్థికంగా క్రుంగ దీయడమేనన్నారు. కార్మికులు, వ్యవసాయరంగంలో ఉన్న వ్యవసాయకార్మికులు, కౌలు రైతులు, రైతుల నోర్లు కొట్టి కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టేలా ఆర్థిక శాఖ మంత్రి సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ఉపాధిహామీకీ గత బడ్జెట్ లో కేటాయించిన దాని కంటే తగ్గించడం దారుణ మన్నారు. కిసాన్ సమ్మాన్ యోజన, ఎరువుల సబ్సిడీ, ఆహార భద్రతకు నిధులు కొత విధించారన్నారు. ఇది గ్రామీణ ప్రజల ఉపాధి దెబ్బతీయడమే గాక రైతులు ఆర్థికంగా దివాళ తీస్తారని, కోట్లాది మంది కొను గోలు శక్తి పడిపోతుందన్నారు. అదే సమయంలో దేశ ఆర్థిక స్థితి చిన్నా భిన్నం అవుతుందని సమావేశంలో పాల్గొన్న నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రం బడ్జెట్ సవరించి ఆయా రంగాలకు బడ్జెట్ కేటాయింపు పెంచాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలనీ సమావేశం డిమాండ్ చేస్తూ తీర్మానించింది. అనంతరం సిఐటి యు కార్యాలయం నుంచి ప్రదర్శనంగా వెళ్లి ఆత్మకూరు బస్టాండ్ వద్ద ధర్నా చేశారు. ధర్నాలో వ్యవసాయకార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య ఉపన్యాసించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘము జిల్లా అధ్యక్షులు వెంకమరాజు, సిఐటియు జిల్లా నాయ కులు రెహనాబేగం, కె. పెంచలనరసయ్య , సురేష్ , ఇరుగాలయ్య , ఆటో నాయకులు రైతు సంఘం నాయకులు వెంకట కష్ణయ్య , పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందనలు



ప్రజాశక్తి -వెంకటాచలం : సర్వేపల్లి సేవా సమితి అధ్యక్షుడు దూడల సుధీర్ బాబు కుమారులు లోకేష్, విద్యానివాసులు కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. గురువారం మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో వారు మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



ధర్నా చేస్తున్న డ్రైవర్లు

డ్రైవర్లకు వేతన బకాయిలు చెల్లించాలి

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు : నగరపాలక సంస్థలో చెత్త వాహనాల డ్రైవర్లకు 6నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి. డ్రైవర్స్ ను విధులలో యధాప్రకారం కొనసాగించాలంటూ ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. గురువారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్, కమిషనర్ హరితలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో చెత్త వాహనాల డ్రైవర్స్ కు గత 6నెలల నుండి జీతాలు చెల్లించకుండా వారిని వేధించడం దారుణమైన చర్య అన్నారు. నగరపాలక సంస్థ బోర్డును పెట్టుకొని ఉద్యోగాలు ఇప్పిస్తానని, లక్షల రూపాయలు రెడ్డి ఏజన్సీకి చెందిన కాంట్రాక్టర్ అక్రమంగా డ్రైవర్ల నుంచి వసూలు చేశారన్నారు. కార్పొరేషన్ ద్వారా పనిచేస్తున్న డ్రైవర్స్ కు 18500/- జీతం ఇస్తుంటే, కాంట్రాక్టర్ క్రింద పనిచేసే డ్రైవర్స్ కు కేవలం రూ. 8250/ ఇచ్చి దోపిడీ చేస్తున్నారన్నారు. పీయఫ్, ఈ. ఎస్. ఐ పేరుతో కార్మికుల వద్ద పట్టుకొన్న డబ్బును కాంట్రాక్టర్ స్వాహా చేశారన్నారు. నగర పాలక సంస్థలో కాంట్రాక్టర్ చేస్తున్న అక్రమాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని, డ్రైవర్స్ ను యధాప్రకారం విధులల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర నాయకులు పి. సూర్యనారాయణ, డ్రైవర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, రిజ్వాన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు


పిహెచ్‌సిలో తనిఖీ

రాపూరు : నెల్లూరు జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ దయాకర్ వేపినాపి పిహెచ్‌సిని తనిఖీ చేశారు. గర్భిణులకు వ్యాక్సిన్లు ఇచ్చేవారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా అక్కడనున్న గర్భిణులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

బహుమతులు అందజేత

పొదలకూరు : పొదలకూరులో ఈనెల 7, 8 తేదీల్లో రెండు రోజుల పాటు స్థానిక వినాయక షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలైన వారికి బుధవారం రాత్రి ఏర్పాటుచేసిన ముగింపు సమావేశంలో బహుమతులను పంపిణీ చేశారు. ప్రథమ బహుమతిని ఊకోటి శ్రీనివాస్ తేజ, అడపాల మస్తాన్ రెడ్డిలు గెలుచుకున్నారు. ద్వితీయ, తతీయ, చతుర్థ బహుమతులను వరుసగా ఊకోటి లక్ష్మీనారాయణ, అయితా రమేష్.. బీపీ నారాయణరెడ్డి, ఏ శేషారెడ్డి.. విజయ భాస్కర్ రెడ్డి, శివలు గెలుచుకున్నారు. విజేతలకు పొదలకూరు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి, వినాయక షటిల్ క్లబ్ అధ్యక్షులు చాట్ల రాధాకష్ణలు బహుమతులను అందజేశారు. వినాయక షటిల్ క్లబ్ గౌరవాధ్యక్షులు ఊకోటి లక్ష్మీనారాయణ, క్రీడాకారులు పెంచలయ్య, హరికష్ణ, డాక్టర్ ప్రవీణ్, మనోజ్, బాలు, శ్రీధర్ పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం




ప్రజాశక్తి -కందుకూరు : మండలం పందల పాడు గ్రామ సచివాలయం పరిధిలోని పందలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ శాసన సభ్యులు మానుగుంట మహీ ధర్‌రెడ్డి గురువారం పాల్గొన్నారు. కందుకూరు మండలం ఎంపిపి ఇంటూరి సుశీల, కందుకూరు జెడ్‌పిటిసి తొట్టెం పూడి అన సూ యమ్మ, కందుకూరు మండల సర్పంచ్ కముజుల పద్మావతి, అధికారులు, పందల పాడు గ్రామ సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.1

పెన్నాకు 'నల్లపరెడ్డి' పేరు..!

శీనయ్యకు ప్రత్యేక గుర్తింపు

ప్రముఖ సీనియర్ రాజకీయ వేత్త, అపరచాణక్యుడుగా పేరు పొంది రాష్ట్రంలోని మంచి గుర్తింపు పొందిన కోట వాసి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అరుదైన గౌవరం దక్కింది. జిల్లా ప్రజలను ఆయన చేసిన సేవలను గుర్తించిన వైసిపి ప్రభుత్వం నూతనంగా పున:నిర్మాణం చేసిన పెన్నా బ్యారేజ్‌కు " నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి" బ్యారేజ్‌గా నామకరణం చేశారు. బుధవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ దీనికి ఆమోదం తెలిపింది. ఇక నుంచి అధికారంగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచి పోనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కుమారుడు కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు పెట్టిన నెల్లూరు పెన్నా బ్యారేజీ ఇదే..



కీర్తిశేషులు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు జిల్లా రాజకీయ చరిత్రలో గుర్తుండిపోయే పేరు. గూడూరు డివిజన్‌లోని కోట గ్రామంలో జన్మించిన ఆయన కింద స్థాయి నుంచి రాష్ట్ర మంత్రిగా, రాష్ట్ర రాజకీయాల్లో కీలక వ్యక్తిగా గుర్తుంపు పొందారు. ఎక్కడ పోటీ చేసినా తనకంటు ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలుత గూడూరు ఎంఎల్ఎగా పోటీ చేసి విజయం సాధించారు. అక్కడ నుంచి వెంకటగిరి వెళ్లమంటే వెళ్లి అక్కడ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అక్కడ నుంచి కోవూరు నియోజకవర్గానికి పంపారు. వరుసగా ఇక్కడ నుంచి విజయం సాధించారు. కోవూరు అంటే నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్న చందంగా గుర్తింపు తెచ్చుకున్నారు. జిల్లాలో అమలు జరిగిన అనేక ప్రాజెక్టు ఆయన మంత్రిగా ఉన్న సమయంలోనే జరిగా యి. భారీ వంతనెలు, బ్రిడ్జిలు, ఒక్కటేమిటి ఆయన అనేక పనులు చేపట్టారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆయన మంత్రిగా ఉన్న సమయంలో తెలుగు గంగ ప్రాజెక్టు నిర్మాణానికి, పూర్తి చేయడానికి కృషిచేశారు. పెన్నా డెల్టా ఆధునికీకరణకు ఆయన పనిచేశారు. ఆయన మరణం అనంతరం అక్కడ నుంచి ఆయన కుమారుడు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఎంఎల్ఎగా పలు దఫాలు కొనసాగారు. ప్రస్తుతం ఉన్నారు. ఆయన చనిపోయిన తరువాత వేదాయ పాళెంలో ప్రజారాజ్యం అధినేత చిరంజీవి ఆయన విగ్రహాన్ని ప్రారంభించారు. అంతకు మించి ఆయన పేరుపై ఎలాంటి ప్రాజెక్టులు లేవు. ప్రత్యేక గుర్తింపు లేదు. అక్టోబర్ 27న ధర్మల్ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి స్పందించారు పెన్నా బ్యారేజ్‌కు ఆయన పేరు పెడుతున్నట్లు ప్రకటించారు. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదన పెట్టి ఆమోదం తెలిపారు. ఇక నుంచి పెన్నా బ్యారేజ్‌ను " నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి "పేరుతో పిలవనున్నారు.

జగన్‌కు రుణపడి ఉంటా...!



నాకుటుంబం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటుంది. జిల్లాలో ఎంతో ప్రజాదరణ కలిగిన శ్రీనివాసులురెడ్డికి ఇప్పటి వరకు సరైన గౌరవం దక్కలేదు. ప్రజల గుండెల్లో ఉన్నారు. తెలుగు గంగ. పెన్నా ఆధునికీకరణ వంటి ప్రాజెక్టులతోపాటు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రహదారులు, డ్రైట్లు, నీటి వసతి కల్పించారు. ఆయన పేరు చిర స్థాయిగా ఉండేలా ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం అభినందనీయం. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు.

నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంఎల్ఎ


టిడిపి నేతపై దాడి హేయం

ప్రజాశక్తి -కందుకూరు చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో జరుగుతున్న యువగళం పాదయాత్రలో భాగంగా టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్ పై సీఐ చేయి చేసుకోవటం దుర్మార్గం అని కందుకూరు నియోజకవర్గ టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు మోదడుగు వెంకటేశ్వర్లు ఖండించారు. డిజిపి స్పందించి దాడి చేసిన సిఐపై చర్యలు తీసుకోవాలన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం కోసం ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతోంది. ఆలయ నిర్మాణం కోసం భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. అమ్మవారి పాదాల చెంత ఉంచే సువర్ణ యంత్రానికి గురువారం ముప్పాళ్ల అంజయ్య భార్య వర్మ ఒక గ్రామ బంగారానికి గాను రూ.5716లు నగదు రూపంలో అమ్మవారికి విరాళంగా నిర్మాణ కమిటీ సభ్యులు యెనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు.

విద్యార్థికి బంగారు పతకం



ప్రజాశక్తి -కందుకూరు : విలువిద్య పోటీలలో అంచలంచెలుగా ఎదుగుతూ వస్తున్న లింగసముద్రం మండలంలోని వాకమల్ల వారిపాలెం గ్రామానికి చెందిన జివియెస్ మనిదిప్ రెడ్డికి రామయ్య ఫౌండేషన్ వారు గత సంవత్సరం స్పాన్సర్ షిప్ ఇచ్చారు. సదరు విద్యార్థి బుధవారం శ్రీకాళహస్తిలో ఎస్‌హెచ్ఎఫ్ అధ్వర్యంలో జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలలో ప్రథమ స్థానాన్ని పొంది బంగారు పతకం సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించిన మనిదీప్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించిన మణి దీప్‌ను రామయ్య ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్, బిజెపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు ఉన్నం నళినీ దేవి అభినందించారు. త్వరలో జరుగబోయే జాతీయ విలువిద్య పోటీలలో కూడా మణి దీప్ ప్రథమ బహుమతిని పొంది బంగారు పతకం సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

ఫోన్ ట్యాపింగ్ విచారణపై

రాష్ట్ర ప్రభుత్వానికి భయం

ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు : తన ఫోన్ ట్యాపింగ్ అయిందని తాను స్వయంగా ఆధారాలతో సహా నిరూపిస్తే విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి భయమెందుకని రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం నగరంలోని రూరల్ ఎంఎల్ఎ క్యాంపు కార్యాల యంలో తనకు మద్దతు ఇస్తున్న 11 మంది కార్పొరేటర్లతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఫోన్ ట్యాపింగ్‌పై బుధవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశానన్నారు. తన ఫోన్ ట్యాపింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి ఫిర్యాదు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదు చేస్తేనే అసలు నిజాలు వెలుగుచూస్తాయన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్రం విచారణ జరిపితే రాష్ట్ర ప్రభుత్వం చేసే మొత్తం ట్యాపింగులు భయపడతాయన్న ఆలోచనతో ప్రభుత్వం దీనిపై స్పందించకుండా రికార్డింగ్ డ్రామా ఆడుతుందన్నారు. ఒక పథకం ప్రకారం అది ట్యాపింగ్ కాదని, రికార్డింగ్ అని తన స్నేహితుడు రామశివారెడ్డిచే చెప్పించారని, అయితే ఆ రికార్డింగ్ వినిపించమని విలేకరులు అడిగితే డిలేట్ అయిందని చెప్పడంతోనే ట్యాపింగ్ అనేది స్పష్టంగా తెలుస్తుందన్నారు. సజ్జల రామకష్ణారెడ్డిపై విమర్శలు చేశారు. తనను నమ్మి తన వెంట నడుస్తున్న కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆదాల' వైసిపి అభ్యర్థి పోటీ చేస్తారా..?

2019 ఎన్నికల సమయంలో రూరల్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా బి ఫారం తీసుకుని, నియోజకవర్గంలో ప్రచారం చేస్తూ చేస్తూ చివరి నిమిషంలో హైదరాబాద్‌లోని వైసిపి కార్యాలయంలో ప్రత్యక్షమ య్యారన్నారు. అటువంటి చరిత్ర కలిగిన ఆదాల ప్రభాకర్ రెడ్డి నేడు రూరల్ నియోజకవర్గానికి వైసీపి ఇంఛార్జ్ గా నియమితుల య్యార న్నారు. అటువంటి వ్యక్తి తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రూరల్ నియోజకవర్గానికి వైసిపి అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్ రెడ్డి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తారని ఖచ్చితంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. తమ ఊపిరి ఉన్నంత వరకూ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితోనే పయనిస్తామని నగర మేయర్ పోట్లూరి స్రవంతి, పలువురు కార్పొరేటర్లు స్పష్టం చేశారు.

ముగిసిన శిక్షణ


ప్రజాశక్తి-నెల్లూరు : యువతకు నాయకత్వ లక్షణాలు, సమాజాభివృద్ధి అంశాలపై నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నగరంలోని ఇన్ఫాన్ జీసస్ శిక్షణ కేంద్రంలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది.డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ ఏ మహేంద్ర రెడ్డి సెట్నల్ సీఈఓ పుల్లయ్య పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి -కందుకూరు : టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఐ. మల్లికార్జున రావు కళాశాల నాక్ అసెస్మెంట్‌కి వెళ్తున్న నేపథ్యంలో కళాశాల అభివద్ధి పనులకు తన వంతు సహాయంగా రూ.12,000లు ప్రిన్సిపాల్‌కి అందజేశారు. అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల నాక్ అసెస్మెంట్‌కి మార్చి నెలలో వెళ్తున్న సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు కళాశాల అభివద్ధికి కృషిచేయాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు.

శ్రీధర్‌రెడ్డి ఆరోపణల్లో వాస్తవం లేదు..

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి, ఎంపి ఆదాల

ప్రజాశక్తి-నెల్లూరు

రూరల్ నియోజకవర్గ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.గురువారం నగరంలోని మినిబైపాస్ రోడ్డు సమీపంలోని రూరల్ నియో జకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ నిజం కాదని, ఆ విషయాన్ని ఆయన స్నేహితుడు రామశివారెడ్డి స్పష్టం చేశారని పేర్కొన్నారు.

రూరల్ నుంచి తాను పోటీ చేస్తా..

రూరల్ నియోజకవర్గం నుండి వైసీపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నావా.. లేదా .. అనే విషయాన్ని స్పష్టం చేయాలని ఆదాల ప్రభాకర్ రెడ్డిపై ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆదాల స్పందించారు. రూరల్ వైసిపి అభ్యర్థిగా తానే పోటీ చేస్తున్నానని, దమ్ముంటే కాస్కో అంటూ సవాల్ విసిరారు. 2019 ఎన్నికల భరిలో నిలిచి విజయం సాధించానని, ప్రస్తుత రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సాధించిన ఓట్లకంటే 5 వేల ఓట్లు అధికంగా సాధించామన్నారు. కోటంరెడ్డి ప్రతీరోజూ మీడియా సమావేశాల్లో చేస్తున్న ఆరోపణల్లో వాస్తవాలు లేవన్నారు. తాను ఏ మచ్చా లేకుండా రాజకీయాలు చేస్తున్నానన్నారు. ఈ మూడున్నరేళ్లలో కోటంరెడ్డి ఎన్ని అరాచకాలు చేశారో, అవన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని హెచ్చరించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, సర్పంచ్ లు, ఎంపిటిసీలు, నేతలు, కార్యకర్తలంతా వైసీపితోనే ఉన్నారని మంత్రి స్పష్టం చేశారు.

కార్పొరేషన్‌లో 'ఆదాల' ఆపరేషన్

మేయర్ లేకుండా సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థలో ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పెత్తనం ప్రారంభించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ హరిత అధ్యక్షతన ఎంపి, రూరల్ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ వైసిపి కార్పొరేటర్లతో, అధికారులతో రివ్యూ నిర్వహించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో రూరల్ పరిధిలో ఉన్న సమస్యలపై కార్పొరేటర్లతో కలిసి నిర్వహించిన సమావేశం మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ లేకుండానే పూర్తి చేశారు. రివ్యూ జరిగినంత రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డినే లక్ష్యంగా పెట్టుకొని పలు సమస్యలపై చర్చించారు.అక్రమ లే అవుట్లు, అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న అపార్టుమెంట్లు, చెడిపోయిన చికెన్, మాంసం విక్రయిస్తున్న దుకాణాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.రూరల్ నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, కార్పొరేషన్ అధికారులు స్థానిక కార్పొరేటర్లను కలుపుకొని పనిచేయాలని పేర్కొన్నారు. వైసిపి కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్‌మాట్లాడారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కావలి

విద్యార్థులు మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలని కావలి ప రెండో పట్టణ ఎస్.ఐ.జె.మాల్యాద్రి విద్యార్థులకు పిలుపునిచ్చారు.జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాస జూనియర్ కాలేజీలో జరిగిన సెమినార్లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగిం చారు. విద్యార్థులు క్రమశిక్షణతో జీవితాన్ని గడపాలని, విద్యార్థులను పక్కదోవ పట్టించే డ్రగ్స్ ఈవీటీజింగ్ తదితర వ్యసనాలకు బలి కాకూడదని కోరారు.విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం చదువు దాన్ని ఎట్టి పరిస్థితుల్లో మరువకూడదన్నారు. తమపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకూడదన్నారు.చదువుతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో వలేటి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సెమినార్లో కళాశాల ప్రిన్సిపాల్ కే మాలకొండయ్య, జన చైతన్య వేదిక సభ్యులు నాగార్జున, ఎస్.కె కాలేషా, అమత్, కార్తీక్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ మాల్యాద్రి

ధాన్యం మద్దతు ధరపై అవగాహన

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని బీరంగుంట, నార్త్ మోపూరు రైతు భరోసా కేంద్రాలలో గురువారం తహశీల్దార్ రామకష్ణ ధాన్యం కొనుగోలు సంబంధిత మద్దతు ధరపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలతో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసిందన్నారు. ధాన్యాన్ని సేకరించి అందులో తేమ శాతాన్ని పరిశీలించిన తదుపరి మద్దతు ధర ప్రకటించడం జరుగుతుందని వివరించారు. రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంప్రదించాలన్నారు. ధాన్యం కొనుగోలు వ్యవహారంలో అవకతవకలు జరిగితే చర్యలు చేపడతామని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు, మండల ఉపాధ్యక్షులు గుమ్మడి సురేంద్ర, నార్త్ ఆములూరు సర్పంచ్ షేక్ కరిముల్లా షా, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్

గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కావలి


"ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ పథకం" కింద డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో గురువారం కావలి రాజీవ్ నగర్ యు.హెచ్.సి.లో గర్భిణులకు, బాలింతలకు డాక్టర్.మేఘనాథ్,చౌదరి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. రాంసెంటర్ నిర్వాహకులు గర్భిణులకు ఉచితంగా టానిక్ లు, మందులు అందజేశారు.డాక్టర్ మేఘనాథ్ చౌదరి మాట్లాడుతూ క్రమం తప్ప కుండా వైద్యపరీక్షలు చేయించు కోవాలన్నారు. మాత, శిశుమరణాలు లేకుండా చూడడం ఈపథకం ఉద్దేశం అన్నారు.గర్భిణులకు అనేక వైద్య సలహాలిచ్చారు. ముఖ్యఅతిథి జవహర్ భారతి రిటైర్డ్, లెక్చరర్, ఆర్.ఎస్.మల్లికార్జున మాట్లాడుతూ విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డి.ఆర్ చేసిన సేవలను కొనియాడారు. మూఢనమ్మకాలు పెట్టుకోకుండా వైద్యుల సలహాలు పాటించాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్లమ నోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, విశ్వోదయరిటైర్డ్, ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. సుదాకరరావు, సామాజి క కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, సునీత, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న దృశ్యం

రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం సేకరణ

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని పాతదేవరాయపల్లి, కొత్తపల్లి గ్రామ సచివాలయంలో రబీ సీజన్ వరి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయనున్నందున రైతులకు అవగాహన కల్పించారు.మండల వ్యవసాయాధికారి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారానే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈకెవైసి చేయించుకోవాలని లేనిచో ధాన్యం కొనుగోలు చేయరన్నారు.రైతు భరోసా కేంద్రంలోని సాంకేతిక సహాయకులు నిర్ణయించిన తేమ శాతం మాత్రమే పరిగణలోకి తీసుకొనబడుతుందని,రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం అమ్మినప్పుడు మాత్రమే కనీస మద్దతు ధర లభిస్తుందని మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు.సివిల్ సప్లయ్‌డిప్యూటీ తహశీల్దార్ శ్యామలాదేవి మాట్లాడుతూ సాధారణ రకం క్వింటాల్ 2040 గ్రేడ్ ఏ రకం 2060 రూపాయలు వంతున మిల్లర్లతో సంబంధం లేకుండా రైతు భరోసా కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి నేరుగా పంపించడం జరుగుతుందని తెలిపారు. ఎవరు రైస్ మిల్లుల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదని తెలియజేశారు. కార్యక్రమంలోతహశీల్దార్ రమణ రావు,షేక్ రమీజా బేగం, సర్పంచ్, ఖాదర్‌బాషా, వీఎఎ, గ్రామ రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఇఒ ఎస్‌కె మస్తాన్‌వలీ

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఉదయగిరి

ఎంపీపీ ఎస్ నార్త్ దళితవాడ ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్ వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం స్థానికఎంపీపీ ఎస్ నార్త్ పాఠశాలలో జరుగు మనబడి నాడు-నేడు ఫేసు- 2 పనులు తనిఖీలో భాగంగా జరుగుతున్న నూతన టాయిలెట్ల నిర్మాణాన్ని పరిశీలించి సిమెంటు ఇసుక కంకర తగు పాలలో వేసి నాణ్యతగా నిర్మాణాలు చేపట్టాల న్నారు. ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వాటర్ తో క్యూరింగ్ చేయాలన్నారు. నాడు-నేడు పనుల నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడేది లేదని పడవద్దని ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యా యులకు సూచించారు. అనంతరం ఇంగ్లీష్ పరిసరాల విజ్ఞానం సబ్జెక్ట్స్ లో జరుగుతున్న క్లాస్ రూమ్ బేస్డ్ అసైన్మెంట్ -2 పరీక్షల పరిశీలించి విద్యార్థులకు ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఉపాధ్యాయ విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం రుచి చూచి సంతప్తి వ్యక్తం చేశారు. రెండు పాఠశాలలోని అన్ని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్టీ హుస్సేనీ, మహమ్మద్ గౌస్ ఉపాధ్యాయులు జాఫర్ మొహిద్దీన్, సంధాని బేగం, రామకష్ణారెడ్డి పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డిని గద్దె దింపడమే లక్ష్యం

ప్రజాశక్తి-అల్లూరు

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని గద్దె దింపడమే ప్రధాన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ నేతలు తెలియజేశారు. గురువారం మండలంలోని పాత వెలిచెర్ల, కొత్త సింగపేట గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టి విస్తత ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ జెడ్‌పిటిసి సభ్యులు బీద గిరిధర్, బండి శ్రీనివాసుల రెడ్డి, అరగల రమణయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల హక్కులను హరించి కార్పొరేషన్ నిధులను దోచుకున్నారని దుయ్యబట్టారు. జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఆ నిధులన్నీ ఏమయ్యాయో తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో బుల్లా కష్ణారెడ్డి, హర్షిత్ రెడ్డి, కావలి జగన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న దృశ్యం

రైతుల వ్యతిరేక బడ్జెట్:రైతుసంఘం

రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

2023-24 కేంద్ర బడ్జెట్ ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుపేదల, మధ్యతరగతి ప్రజలకు రైతులకు జీవన విధానం మార్పునకు పెద్దగా తీసుకున్నట్లు కనిపించలేదని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌కు బడ్జెట్ కు వ్యతిరేకంగా వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ 2023-24 బడ్జెట్లలో వ్యవసాయ రంగానికి నిర్లక్ష్యంగా కాబడిందని ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్ రైతులకు కోత విధించారని పైగా ఎరువుల సబ్సిడీ పూర్తిగా తగ్గించారు. దీనివలన పేద మధ్యతరగతి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని పైగా కార్పొరేట్ రైతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో తగ్గించడంతో ఉపాధి కూలీలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ప్రజలు నిత్యావసర వస్తువులు ధరలు పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు అనేక విషయాలలో కేంద్ర ప్రభుత్వం విధానాలు కారణంగా సాధారణ మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ బడ్జెట్ పై సాధారణ జనం బాధలు పట్టించుకోరని అందరూ భావిస్తున్నారు. మన రాష్ట్రంలో రైతులు , కౌలు రైతులు పూర్తిగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఈ బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి మద్దతు కల్పించి రైతులను ఆదుకోవాలని ఆత్మకూరు మండల కౌలు రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గంట లక్ష్మీపతి,కష్ణ ప్రసాద్, కష్ణమోహన్, బుర్ర శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాష్ట్రంలో తుగ్లక్ పాలన

టిడిపి మాజీ ఎంఎల్ఎ బొల్లినేని

ప్రజాశక్తి-ఉదయగిరి

తెలుగుదేశం పార్టీ ఈసారి గెలిపించుకోకపోతే పరిస్థితులు దారుణంగా ఉంటాయని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక చెంచలబాబు అతిథి గహంలో మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంను చింతనబోయిన బయన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తుగ్లక్ పాలనలో రాష్ట్రం అన్ని విధాల వెనుకబడ పోయిందన్నారు. ముఖ్యంగా అభివద్ధి కనిపించడం లేదని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్టాన్ని 22 సంవత్సరాలు పరిపాలన చేసినప్పటికీ ఈనాడు ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో అలసత్వం వహించలేదని ప్రతినెల ఒకటో తారీకు చెల్లించేదన్నారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేని దుస్థితిలో ఉందని సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఒక్కొక్కరిగా పార్టీని వీడుతూ ఆయనపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏ క్షణంలోనైనా ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని మండలంలో ఉన్న 17 పంచాయతీలో కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి ఎన్నికలు ఎప్పుడు వచ్చిన తెలుగుదేశం పార్టీ గెలుపునకు కషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి బంగారు పళ్లెంలో పెట్టి మనకు ప్రభుత్వాన్ని అప్పగించడం ఖాయమన్నారు. అలాగని నియోజకవర్గం టిడిపి గెలుపు వడ్డించిన విస్తరి కాదని కష్టపడితే ఫలితం దక్కుతుందన్నారు. కార్యకర్తల్లో ఉన్న చిన్నచిన్న మనస్పర్ధలు పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేయాలన్నారు. మన అందరం కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి గా చంద్రబాబు నాయుడుని గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. మేకపాటి సోదరులు గతంలో ఈ నియోజకవర్గానికి పలుమార్లు ప్రాతినిధ్యం వహించినప్పటికీ తాను ఒక్కసారిగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి అభివద్ధి చేసిన అభివద్ధి పనులలో సగభాగం వారు చేయలేదని విమర్శించారు కావలి, సీతారాంపురం హైవే రోడ్డు కావడంతో రహదారి పక్కన ఉన్న భూములకు విపరీతంగా రేట్లు పెరిగాయన్నారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చెంచల బాబు యాదవ్ మాట్లాడుతూ 2023 జనవరి నుంచి ఎన్నికల వాతావరణం రాష్ట్రంలో ఏర్పడిందని, అదేవిధంగా జిల్లాలో రాజకీయం క్షణక్షణానికి మారుతుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎన్నికల వాతావరణం కనబడుతుందన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి పార్టీ అత్యధిక మెజార్టీ సాధించాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో కలివెల జ్యోతి, రవీంద్రబాబు, షేక్ రియాజ్, రాజా, కాకి ప్రసాద్, మల్లికార్జున్ ,అరుణమ్మ, నరసింహారాజు, రాజు, ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు


మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ బొల్లినేని


ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలేస్తున్న దృశ్యం

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కొండాపురం

మండలంలోని సాయిపేటలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీజిల్లా అధ్యక్షుడు అజీజ్, మాజీ శాసనసభ్యుడు బొల్లినేని వెంకట రామారావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో నియోజకవర్గంలో ఎంతో అభివద్ధి పనులు చేశామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల అభివద్ధిఎక్కడ కనబడ లేదన్నారు. ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం తప్ప ఇంకా ఏమైనా జరిగిందా అని ప్రశ్నించారు. అనంతరం మాజీ మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామమైన సాయి పేటలో మహా నాయకుడు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయటం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. మండలంలోని టిడిపి నాయకులు ఉండి పార్టీని అభివద్ధి చేయాలన్నారు. టిడిపి సీనియర్ నాయకుడు గంటా లక్ష్మీనరసింహం పార్టీకి దూరంగా ఉన్నారని, ఆయనను కలుపుకొని గ్రామంలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ముందుగా స్థానిక టిడిపి నాయకుడు కుంకు మోహన్ రావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చి విగ్రహం ఆవిష్కరించారు.కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసింహం, చెరుకూరు వెంకటాద్రి, ఏరవ కష్ణయ్య, గద్దె రామకష్ణ, వల్లూరు వెంకటేశ్వర్లు, కుంకు రాజా, బద్దిపూడి మాచర్ల,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మార్గదర్శకాలకు అనుగుణంగా ఆక్వాజోన్లు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో ఆక్వా జోన్ల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలు ఖచ్చితంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్ బాబు పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ చక్రధర్ బాబు అధ్యక్షతన ఆక్వా జోన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆక్వా జోన్ల ఏర్పాటు, వాటి ఆవశ్యకత, అధికారులు తీసుకున్న చర్యలపై మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వర రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మరింతగా ఆక్వా సాగును పెంపొందించే క్రమంలో శాస్త్రవేత్తలు, నిపుణులు, ఆక్వా రైతుల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని, జిల్లా ఆక్వా సాగు కు అనువైన ప్రాంతాలను గుర్తించి ఆ దిశలో అడుగులు వేయాలన్నారు. ఆక్వాకల్చర్ జోన్ ప్రకటన ద్వారా స్థిరమైన ఆక్వా సాగును ప్రోత్సహించండమై దష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆక్వా జోన్ల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలు ఖచ్చితంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆక్వా సాగు చేసే రైతులకు విద్యుత్ పై ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడం ద్వారా ఆక్వా కల్చర్ ను ప్రోత్సహించడం జరుగుతున్నట్లు పేర్కొన్నారు. పర్యావరణ హిత ఆక్వా సాగును ప్రోత్సహించుటకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లా పరిధిలో 15 మండలాల్లోని 98 గ్రామ పంచాయతీల్లో ఆక్వా సాగు చేస్తున్న 12,557.42 హెక్టార్ల భూమిని ఆక్వా జోన్ లోకి తీసుకుని వచ్చేందుకు కమిటీ ఆమోదం తెలపడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వర రావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి-కావలి.

సంయుక్త సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో పట్టణ వాసులు కానిస్టేబుల్ రాజ్యం, వారి కుమారుడైన వల్లెపు గురు శశాంక్ పుట్టినరోజు సందర్భంగా గురువారం బుడంగుంట గిరిజన ప్రాంతం లోని పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. పేదలకు ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని తెలిపారు.





మాట్లాడుతున్న మేడా శ్రీనివాస్

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-కావలి

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ కో-ఆర్డినేటర్,గా తనను రాష్ట్ర అధ్యక్షులు మేడా శ్రీనివాస్ నియమించినట్లు గోశాల రవికాంత్ తెలిపారు. గురువారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలపై,అవినీతి అరాచకాలపై పోరాడి,రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీని మేడా శ్రీనివాస్ ఏర్పాటు చేశారని తెలిపారు. తనను ప్రజా న వ స్యలపై పోరాడేందుకు కావలి నియోజకవర్గ కో ఆర్డినేటర్ గా అవకాశం కల్పించిన వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు.


పూజలు చేస్తున్న నాయకులు

ఎంఎల్ఎ కోలుకోవాలని పూజలు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని మండల వైసీపీ నాయకులు సాయి బాబా గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. గురువారం స్థానిక బిట్-1 ఎంపీటీసీ గొల్లపల్లి తిరుప తయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని గురువారం గురు పౌర్ణమి రోజున స్థానిక సాయిబాబు గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజక వర్గంకు నిస్వార్థ సేవలు అందిస్తూ ప్రజల ఆరాధ్య దైవం అనారోగ్యంకు గురికావడం నియోజకవర్గ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. వెంటనే కోల్కొని నియోజకవర్గం ప్రజలకు అందుబాటులోకి రావాలని ఈ ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మూలే. సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు గడ్డం హజరతయ్య, సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి, సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్ల రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

జిల్లాలో మరో నాలుగు ఇసుక రీచ్‌లు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో నాలుగు ఇసుక రీచ్ లను నూతనంగా ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ కె వి ఎన్ చక్రధర్ బాబు వెల్లడించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇసుక రీచ్ లపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని మినగల్లు, అనంత సాగరం మండలంలోని పడమటి కంభంపాడు, విడవలూరు మండలంలోని ముదివర్తి, ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ ల వివరాలను మైన్స్ అండ్ జియాలజీ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక రీచ్ ల వద్ద ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రజల అవసరాల మేరకు త్వరితగతిన ఇసుక సరఫరా పై ప్రత్యేక దష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ డిడి సిహెచ్ సూర్య చంద్ర రావు, ఏడి శ్రీనివాసరావు, భూగర్భ జల శాఖ డి డి శోభన్ బాబు, ఇన్చార్జ్ ఆర్‌డిఒ కె. మురళీమోహన్, డిపిఓ చిరంజీవి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ ఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న నాయకులు

ఎంఎల్‌సి ఎన్నికల క్యాంపెయిన్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పురపాలక పరిధిలోని ప్రకాశం. - నెల్లూరు , చిత్తూరు జిల్లాల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల సందర్భంగా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లు రెడ్డి , ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబు రెడ్డిలను ఓట్లు వేసి గెలిపిం చాలని వారికి మద్దతుగా ఎన్నికల క్యాంపెయిన్ గురువారం ఎల్ ఆర్ పల్లి ప్రాంతంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని , ఉపాధ్యాయులు గంగాధర్ , వాగాలశ్రీహరి, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలపై ఆర్‌టిఎ దాడులు

ప్రజాశక్తి-కోవూరు


స్థానిక ఆంజనేయ స్వామి గుడి వద్ద గురువారం ఆర్‌టిఎ అధికారులు దాడులు నిర్వహించారు. వాహనాలు ఆపి తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలమురళి మాట్లాడుతూ కోవూరు బుచ్చిరెడ్డిపాలెం మండలాల్లో దాడులు చేశామన్నారు కోవూరులో ఇప్పటికే 450 పైచిలుక వాహనాలు చలానాలు కట్టకుండా ఉన్నాయన్నారు. కాలం చెందిన వాహనాలను కూడా తమ దష్టికి తీసుకువస్తే వారి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గోపి నాయక్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రఘు వర్థ రెడ్డి, తదితర సహాయక సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న దృశ్యం

కె.విశ్వనాద్‌కు నివాళులు

ప్రజాశక్తి-కావలి

స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో గురువారం కళా తపస్వి కె.విశ్వనాథ్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వక్త, అధ్యాపకులు అన్నదాత(ప్రాస) మణి ప్రసంగించారు. నందనవనం మధు పి.వి.ఎస్. ప్రసాద్, ఏ.వి.రమణయ్య, బెహరా లక్ష్మి నారాయణ, టీవీ ఎన్ ప్రకాష్, తెలికేపల్లి శ్రీను, మారుతీరావు, కొండయ్య, వెంకయ్య, సునీల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఉత్సవంలో పాల్గొన్న ప్రజలు

నేడు నూతన విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పురపాలక పరిధిలోని నెల్లూరు పాలెం వింజమూరు పోయే రోడ్డు వద్ద పురాతన దేవాలయం జీర్ణోదరించి నెల్లూరు పాలెం గ్రామ పెద్దలు దాతల సహకారంతో శుక్రవారం ఉదయం 9 గంటలకు పోలేరమ్మ నూతన విగ్రహ ప్రతిష్ట చేయడం జరుగుతుంది. అందులో భాగంగా గురువారం నెల్లూరు పాలెం లో పోలేరమ్మ గ్రామోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రాల్లో అవగాహన

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం, ముంగమూరు ఏనుగుల బాయి పంచాయతీలలో రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారిని విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలో పండించిన ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో పంపి రసీదులు తీసుకోవాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ముంగమూరు ప్రెసిడెంట్ రాయి వినోద్ యాదవ్, ఏనుగుల భావి ప్రెసిడెంట్ ,గ్రామస్తులు ,సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -రాపూరు

వెంకటగిరి నియోజకవర్గ టిడిపి బిసి నాయకుడు డాక్టర్ బొలికర్ల మస్తానా యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 12 ఆదివారం రాపూరులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మస్తాన్ యాదవ్ తెలిపారు. ఈ శిబిరం రాపూరు సివికె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కీళ్ల నొప్పులు,మెడ నొప్పులు ,నడుం నొప్పి, కిడ్నీలో రాళ్లు, గైనిక్ సమస్యలు, బిపి షుగర్ గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులు సమస్యలు, దంత సమస్యలు, నరాల సమస్యలు, క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు సంబంధించిన నిపుణులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించడంతోపాటు రోగులకు ఉచితంగా మందులు, పంపిణీ చేస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.